


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 28-01-2026 సంపుటి : 07 సంచిక 255 పేజీలు : 8 వెల : రూ 3-00


# నేటి నుంచి మేడారానికి దారులు ఇలా



ములుగు: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 28 నుంచి 31వరకు జరగనున్న సమ్మక్క- సారలమ్మ మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పోలీసులు ప్రత్యేక ర్యూట్ మ్యాప్‌ను రూపొందించారు. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, జనగామ, వరంగల్ నుంచి ప్రైవేటు వాహనాల్లో వచ్చే భక్తులు వరంగల్ మీదుగా ములుగు, పస్రా, వెంగళాపూర్, నార్లాపూర్ మీదుగా మేడారంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేపట్టారు. వీరు తిరుగు ప్రయాణం నార్లాపూర్, బయ్యక్కపేట, కమలాపూర్ క్రాస్, భూపాలపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మహారాష్ట్ర, కాళేశ్వరం, భూపాలపల్లి, మంచిర్యాల, గోదావరిఖని, ఆదిలాబాద్, కరీంనగర్ నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలు కమలాపూర్ క్రాస్ వద్ద నుంచి రాంపూర్, గొల్లబుద్ధారం, బయ్యక్కపేట, నార్లాపూర్ మీదుగా మేడారం సమీపంలోని ఊరట్టం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల వరకు చేరుకోవాలి. వీరు తిరిగి అదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కొత్తగూడెం, భద్రాచలం, చర్ల, ఖమ్మం నుంచి వచ్చే ప్రయాణికులు ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి మీదుగా ఊరట్టం పార్కింగ్ స్థలాలకు అనుమతించనున్నారు. వీరు తిరిగి ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. ఇక వీఐపీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు మేడారం వచ్చేందుకు తాడ్వాయి రూట్‌ను పోలీసులు ప్రత్యేకంగా కేటాయించారు. వీరు తిరిగి అదే దారిలో వచ్చి వెళ్లేలా ఏర్పాట్లు చేపట్టారు.



# ఢిల్లీలో అరుదైన ఘట్టం

## చారిత్రక ఘట్టం.. భారత్-ఈయూ ఒప్పందంలో కీలక అంశాలివే..



ఢిల్లీ, జనవరి 27: దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఓ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. భారత్ – ఐరోపా సమాఖ్య(ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఈటం) ఖరారైంది. ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈ మేరకు మంగళవారం.. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. భారత్ – ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలను తొలిసారి 2007లో ప్రారంభించాయి. 18 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈ ఒప్పందం ఖరారైంది. ఎఫ్‌టీఏ ఒప్పందంలో ఖరారైన కీలక అంశాలేంటో తెలుసుకుందాం.. ఈయూతో జరిగిన తాజా ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, డైమండ్స్, లెదర్ వంటి రంగాలకు ప్రోత్సాహం కానుంది. ఇదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలు భారత మార్కెట్లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపైనా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. యూరప్.. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి, ఇతర ప్రాంతాలతో తన దౌత్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో భారత్‌తో ఈ కొత్త భాగస్వామ్యం ఏర్పడింది. రక్షణ రంగం విషయంలో భారత్, ఈయూ 2004 నుంచి వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్నాయి. తాజాగా.. కుదిరిన రక్షణ భాగస్వామ్యం(రాఆఖ) ఒప్పందం ఇరుపక్షాల మధ్య రక్షణ, భద్రతా సహకారాన్ని మరింత దగ్గర చేసింది. ఈ ఒప్పందంతో ఈయూ నిర్వహించే సెక్యూరిటీ యాక్షన్ ఫర్ యూరప్ కార్యక్రమంలో పాల్గొనడానికి భారతీయ సంస్థలకు మార్గం సుగమమైంది. ఇరుదేశాల స్వేచ్ఛా వాణిజ్యం విషయానికి వస్తే.. ఈ ఒప్పందం కోసం 2007లో చర్చలను ప్రారంభించాయి. అయితే ఇరుపక్షాల లక్ష్యాల్లో వ్యత్యాసం కారణంగా 2013లో చర్చలు ఆగిపోయాయి. 2022 జూన్‌లో తిరిగి ప్రారంభమయ్యాయి. స్వేచ్ఛా వాణిజ్యంలో జరిగిన ఒప్పందంతో ఐరోపాకు భారతీయ కార్మికుల రాకపోకలు సులభతరం కానున్నాయి. ఈయూ వస్తువుల వాణిజ్యంలో భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈయూతో భారత్ వస్తువుల వాణిజ్యం సుమారు 136 బిలియన్ డాలర్లుగా ఉందని పలు ఏజెన్సీలు తమ నివేదికల్లో పేర్కొన్నాయి. మొత్తంగా ఢిల్లీలో జరిగిన 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఢిల్లీలో జరిగిన 77వ భారత గణతంత్ర ఉత్సవాలకు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# అది టీడీపీ రక్తంలోనే లేదు..

## అంతా చంద్రబాబు సైనికులమే: లోకేశ్




అమరావతి, జనవరి 27: టీడీపీలో కార్యకర్తలే అధినేతలుగా ఉంటారని, పార్టీలో యువతకు తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ కమిటీల శిక్షణ తరగతుల కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. అన్ని పదవుల్లో సామాజిక న్యాయం చేయాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. మహిళలను గౌరవించాలని, 33 శాతం పదవులు వారికి కేటాయించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందన్నారు మంత్రి. రైతులకు ఏ కష్టం వచ్చినా ముందుండి సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ అంటే కమిట్మెంట్ ఉన్నవారికే కమిటీల్లో బాధ్యతలు అప్పగించామని, 83 శాతం మంది కొత్తవారికి పార్లమెంటరీ కమిటీల్లో చోటు కల్పించామని మంత్రి వెల్లడించారు. పార్టీనే అందరికీ అధినాయకత్వం అని పేర్కొన్న లోకేష్.. సేనాధిపతి చంద్రబాబుకి తామందరం సైనికులమని చెప్పుకొచ్చారు. మడమ తిప్పటం, మాట మార్చటం తెలుగుదేశం రక్తంలోనే లేదన్నారు. చేసిన పనులు చెప్పుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు తీసుకురావాలని, గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో స్థాయికి చేరేలా సంస్కరణలు చేపట్టామని తెలిపారు.






# ఏపీ ప్రయోజనాలను అఖిలపక్ష సమావేశంలో లేవనెత్తిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



న్యూఢిల్లీ, జనవరి 27: ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రయోజనాలతో పాటు దేశవ్యాప్త సమస్యలను లేవనెత్తినట్లు ఎంపీ తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భేటీలో ప్రధానంగా 16 ఏళ్లలోపు యువతకు సోషల్ మీడియా అందుబాటులో లేకుండా నిషేధించాలనే అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని కోరినట్లు తెలిపారు. పొగాకుపై సెస్ స్థానంలో జీఎస్టీ ప్రవేశపెట్టడం వల్ల చాలా గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. పొగాకు వాణిజ్యం స్తంభించిపోయిందని.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ అంశంపై చర్చ జరిగి సమస్య పరిష్కారం జరగాలని కోరానన్నారు. ఛార్జ్‌షీట్ నమోదైనా చాలా మంది క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, ఈ అంశంపైనా పార్లమెంటులో చర్చ అవసరమని లేవనెత్తినట్టు ఎంపీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరామన్నారు ఎంపీ. పూర్వోదయ పథకం కింద ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను చేర్చినట్లే ఆంధ్ర ప్రదేశ్‌కూ ఈ పథకం వర్తింపజేయాలని.. దీనిపై చర్చ జరగాలని కోరినట్లు తెలిపారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద ఏపీకి 26 వేల కోట్లు మంజూరైనా.. రాష్ట్ర వాటా కింద నిధులు సమకూర్చాల్సి వస్తుందని, కేవలం రూ.2 వేల కోట్ల కేంద్ర నిధులు మాత్రమే వినియోగించుకున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చగలిగితే రాష్ట్రం వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉందని, ఈ అంశంపై చర్చ జరగాలని ప్రతిపాదించామని లావు శ్రీకృష్ణదేరాయలు పేర్కొన్నారు. కాగా.. ఢిల్లీలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అఖిలపక్ష భేటీ నిర్వహించింది కేంద్రం. ఈ సమావేశానికి వివిధ పార్టీల లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ నుంచి మిథున్ రెడ్డి, పిల్లి సుభాశ్ చంద్రబోస్, బీఆర్ఎస్ నుంచి కేఆర్.సురేశ్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదు

కృష్ణా జిల్లా: వైసీపీ మాజీ మంత్రి పేర్ని నానిపై కేసు నమోదైంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు



ఆయనపై ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నానిపై 196(1), 353(2), 351(2), 352 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు పెట్టారు. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా చాట్రాయిలో జరిగిన వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పేర్ని నాని రెచ్చిపోయి మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై మండిపడిన టీడీపీ శ్రేణులు.. మచిలీపట్నంలోని ఇనగుదురుపేట పీఎస్‌లో నానిపై ఫిర్యాదు చేశారు.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం

విజయవాడ, జనవరి 27, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పట్టాభిషేకానికి ముహూర్తం రెడీ అయిందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి గా నారా లోకేశ్ ను వచ్చే ఏడాది చేయాలని అంతా సిద్ధం చేస్తున్నట్లు పార్టీలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఢిల్లీలోనూ ఈ మేరకు బీజేపీ కే?ంద్ర పెద్దలతో ఈ విషయం చర్చించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు కనపడుతున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ భావినేతగా నారా లోకేశ్ ఇటు క్యాడర్ లోనూ, అటు నేతల్లోనూ ఫిక్సయిపోయారు. అయితే ముఖ్యమంత్రి పదవి చేపట్టే దెప్పుడు అన్న దానిపైనే జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పదవి అన్న ప్రచారం జరిగినా దానిని కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే మంచిదన్న అభిప్రాయంలో నారా కుటుంబం ఉందని తెలిసింది.నారా లోకేశ్ పార్టీపైనా, ప్రభుత్వంపైన ఇప్పటికే పట్టు సంపాదించుకున్నారు. ఆయన విద్య, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ అన్ని శాఖల బాధ్యతను నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఇక ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు తో సమానంగా పర్యటిస్తూ కేంద్రమంత్రులను, బీజేపీ పెద్దలను తరచూ కలసి వస్తున్నారు. నారా లోకేశ్ ఎప్పటికైనా ఈ పదవి ఇవ్వడం తప్పదు. టీడీపీ క్యాడర్ అభిప్రాయం కూడా అదే. అయితే చంద్రబాబు నాయుడు ఈ టర్మ్ ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే అప్పుడు నారా లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేద్దామని భావించినప్పటికీ కొన్ని కారణాలతో వచ్చే ఏడాది.. అంటే సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ముఖ్యమంత్రిగా నారా లోకేశ్ ను చేయాలని నారా కుటుంబం ఫిక్సయినట్లు వార్తలొస్తున్నాయి.తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయింది. అందుకే ఈసారి నారా లోకేశ్ ను ముందుగానే ముఖ్యమంత్రిని చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు కూడా ఉన్నారని తెలిసింది. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా గత కొద్ది రోజులుగా జరుగుతుంది. అందుకే మంత్రి వర్గ సమావేశానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతోనూ, పార్లమెంటు సమావేశాలకు ముందు పార్లమెంటు సభ్యులతో నారా లోకేశ్ సమావేశమయి వారికి దిశానిర్దేశం చేయడం కూడా ఆ ఆలోచనల్లో భాగమేనని అంటున్నారు. ముందుగా మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు



జగన్ పాదయాత్ర ప్రారంభం కాకముందే నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి పదవి పై కూర్చోబెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు బలంగా అమరావతిలోనూ టాక్ వినిపిస్తుంది. మరి ఇది ప్రచారమా? లేక నిజంగా జరుగుతుందా? అన్నది చూడాలంటే మరికొన్ని నెలలు వేచి చూడక తప్పదు.చంద్రబాబు నాయుడు పాలనలో కొన్ని లోపాలు జగన్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలున్నాయి. కానీ టీడీపీ నాయకత్వం లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఎమ్మెల్యేల అవినీతి ఆరోపణలతో పాటు పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా ఈసారి టీడీపీకి అననుకూలత అని చెప్పాలి. చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లినప్పటికీ అక్కడ టీడీపీ నేతలతో సమావేశం అవుతున్నా.. తాను చెప్పదలచుకున్నది చెప్పి వచ్చేస్తున్నారు. అంతే తప్ప వారి బాధలను, కష్టాలను కూడా స్వయంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.ఇక నారా లోకేశ్ కూడా క్యాడర్ ను పట్టించుకునే తీరిక.. సమయం ఆయనకు లేదు. కార్యకర్తలకు భరోసా ఉంటానని చెప్పిన లోకేశ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కనీసం టీడీపీ సోషల్ మీడియాలో కనిపించే నెగిటివ్ ఒపీనియన్ లను కూడా లోకేశ్ కు టీం చేర వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఆల్ ఈజ్ వెల్ అన్న ఫీలింగ్ లో ఉన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలసి ఉంటే జగన్ ను సులువుగా ఓడించగలమన్న ధైర్యం మాత్రమే తండ్రీకొడుకుల్లో కనపడుతుంది తప్ప.. క్యాడర్ కష్టాలను పట్టించుకోవాలన్న ధ్యాస మాత్రం ఇసుమంతైనా పెట్టడం లేదు. అదేమంటే రాష్ట్రాభివృద్ధి కోసం అంటూ రాగాలు తీస్తున్నారు.దీంతో స్థానిక శాసనసభ్యులు కనీసం టీడీపీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం లేదు. స్థానిక నాయకత్వం వారి నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యతను వారిద్దరిలో ఎవరో ఒకరు తీసుకోకపోతే పార్టీకి నష్టం వాటిల్లుతుంది. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ఫిక్స్‌డ్ ఓటు బ్యాంక్‌ను కదిలించటం చాలా కష్టం. టీడీపీకి ఉన్న ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవాలి, తటస్థ ఓటర్లను మెప్పించాలి. ప్రస్తుతం ఉన్న తీరులో టీడీపీ శ్రేణులే స్తబ్దుగా ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్ లుపాలనలోనే మునిగిపోవటం టీడీపీకి నష్టం చేస్తుందేమో అన్న ఆందోళన టీడీపీని అభిమానించే వారిలో ఉన్నారు. ఏ ఏ వర్గాలు కూటమి ప్రభుత్వం పాలనపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రయత్నం చేయకపోగా.. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల నష్టం తప్ప లాభం ఏమీ ఉండదన్నది ఇప్పటికైనా పసుపు పార్టీ నాయకత్వం గుర్తించ గలిగితే కొంత నష్టనివారణ చేపట్టవచ్చు.


## వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా



విజయవాడ, జనవరి 27, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40% ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్ మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్ట చెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

## ఏపీలో రాజ్యసభ రేస్ షురూ...

అమరావతి, జనవరి 27, ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. ఈ ఏడాది జూన్ తో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అంతకంటే ముందే వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక జరగనుంది. అయితే కూటమికి స్పష్టమైన బలం ఉండడంతో.. ఆ నాలుగు స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడంతో ఆ పార్టీకి ఛాన్స్ లేదు. ఆ పార్టీ పోటీ చేయదు కూడా. ప్రస్తుతం వైసీపీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు రాజ్యసభలో. అయితే ముగ్గురు ఖాళీ కానుండడంతో నలుగురు సభ్యులు మిగలనున్నారు. అయితే కూటమి పార్టీలో మాత్రం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.ఈ ఏడాది జూన్లో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్, వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యం. ఏడాది కిందట సాన సతీష్ టిడిపి తరఫున గెలవడంతో ఆయనకు రెన్యువల్ చేయనున్నారు. అయితే మిగతా మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను తీసుకుంటుంది? జనసేనకు ఎన్ని? బిజెపికి ఎన్ని? అనేది చర్చ నడుస్తోంది. అయితే మొత్తం నాలుగు ఎంపీ స్థానాల్లో టిడిపికి మూడు, జనసేనకు ఒకటి దక్కే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో జనసేనకు అవకాశం కల్పించలేదు. బిజెపి ఎక్కువ ఎంపీ పదవులను దక్కించుకుంది. అందుకే ఈసారి బిజెపికి ఛాన్స్ లేదని.. జనసేనకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి మూడు పార్లమెంట్ స్థానాలకు గాను.. ఒకటి సానా సతీష్ కు కొనసాగింపు ఉంటుంది. మిగతా రెండు ఎంపీ పదవుల కోసం పార్టీలో విపరీతమైన పోటీ ఉంది. ముఖ్యంగా వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, భాష్యం రామకృష్ణ, గల్లా జయదేవ్, దేవినేని ఉమామహేశ్వరరావు.. ఇలా చాలామంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడే ఓడిపోతానని తెలిసి రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు యనమల రామకృష్ణుడు సైతం రాజ్యసభ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని రకాల పదవులు అనుభవించారు. అందుకే ఇప్పుడు పెద్దల సభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు. భాష్యం రామకృష్ణ సైతం ఎంపీగా పోటీ చేయాలని చూశారు. అప్పట్లో అవకాశం దక్కలేదు. రాజ్యసభ ద్వారా ఆ కోరిక తీర్చుకోవాలని చూస్తున్నారు. గల్లా జయదేవ్ అయితే 2024 ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. అయినా సరే పార్టీతో అనుబంధం ఎక్కువ. రాజ్యసభ పదవి కోరుకుంటున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు అయితే పార్టీ కోసం టికెట్ వదులుకున్నారు. తనకు రాజ్యసభ ఇవ్వాలని కోరుతున్నారు.అయితే సాధారణంగా రాజ్యసభ పదవి అంటే కార్పొరేట్ సెక్షన్ తో కూడుకున్నది. జాతీయస్థాయిలో సంబంధాలు, పెద్ద పెద్ద వ్యవహారాలు చూసేవారికి ఆ పదవి కట్టబెడతారు. అందుకే ఈసారి కొత్త వ్యక్తులకు అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. అనూహ్యంగా కొందరు వ్యక్తులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని టిడిపి వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత నిజం ఉందో చూడాలి. కానీ ఆశావహులు మాత్రం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.



## అమరావతికి చట్టబద్ధత..

అమరావతి, జనవరి 27, అమరావతి రాజధాని కి చట్టబద్ధతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చట్టం చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు వరుసగా కేంద్ర మంత్రులతో సమావేశాలు కావడం.. టిడిపి తో పాటు కూటమి ఎంపీలకు కీలక సూచనలు చేయడం చూస్తుంటే మాత్రం బిల్లు పార్లమెంట్ లోకి వస్తుందని అర్థమవుతోంది. అయితే ఇప్పుడు ఆ 29 గ్రామాలను మాత్రమే కలిపి అమరావతిగా గుర్తిస్తారా? లేకుంటే పక్కన ఉన్న విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ గుర్తిస్తారా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది.



ఇప్పటికే అమరావతి అంటే మున్సిపాలిటీ కాదు అని.. అదో మహానగరం గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కేంద్రం చట్టబద్ధత కల్పిస్తున్న దృష్ట్యా అమరావతిని మరింత విస్తృతపరచి గుర్తించాల్సిన అవసరం ఉంది. విజయవాడ తో పాటు గుంటూరు నగరాలను కలిపితేనే.. అమరావతి అనేది ఒక అద్భుతమైన నగరంగా ఆవిష్కృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. అందరి అభిప్రాయంతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 50 వేల ఎకరాల వరకు సమీకరించి అమరావతి రాజధాని పనులను మొదలుపెట్టారు. ఇంతలోనే అధికార మార్పిడి జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అమరావతి నిర్వీర్యం అయింది. గత ఐదేళ్లపాటు అమరావతి రైతులు పడరాని పాట్లు పడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి చుక్కలు చూపించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం వచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి కూడా. అయితే ఇప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధానిపై విషం కక్కుతూనే ఉంది. దీంతో అమరావతికి చట్టబద్ధత తెస్తే కానీ తమకు శాంతి ఉండదని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. అందుకే ఏపీ విషయంలో ప్రత్యేక పరిగణలోకి తీసుకొని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది.అయితే కేవలం 29 పంచాయితీలను మాత్రమే అమరావతిగా గుర్తిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికే అదనపు భూసేకరణ చేపడుతున్నారు. చెంతనే విజయవాడ ఉంది. ఆపై గుంటూరు నగరం కూడా ఉంది. కృష్ణా,గుంటూరు, ఎన్టీఆర్ తో పాటు పరిసర జిల్లాల్లో కొన్ని ప్రాంతాలను అమరావతిలో చేర్చితే ఇదో మహానగరంగా, ప్రపంచ స్థాయి నగరంగా గుర్తించబడుతుంది. ఇప్పటికే అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది ప్రణాళిక. అందుకు తగ్గట్టు చంద్రబాబు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆ 29 పంచాయితీలకే అమరావతిని పరిమితం చేయడం ఎంత మాత్రం సుముఖత కాదు. అయితే అందుకే సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలతో సమన్వయం చేసుకుంటున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత విషయంలో సానుకూలతలకు ప్రయత్నిస్తున్నారు. విస్తృత సంప్రదింపులు జరపాలని పార్టీ ఎంపీలకు సూచిస్తున్నారు. మొత్తానికైతే అమరావతి చట్టబద్ధత విషయంలో ఏం జరుగుతుంది అనే దానిపై అంతటా చర్చ నడుస్తోంది.

## కావేరి ట్రావెల్స్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

కర్నూలు.కర్నూలు శివారు టిడ్కో హౌస్ సమీపంలో కావేరి ట్రావెల్స్ బస్సు అదుపుతప్పింది. రోడ్డు డివైడర్ దాటి పక్క రోడ్డులోకి దూసుకుపోయింది. ఆ సమయానికి ఎదురుగా ఏ వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో 29 మంది ప్రయాణీకులు వున్నారు. పెను ప్రమాదం తప్పిపోవడంతో ప్రయాణీకులు ఊపిరిపీల్చుకున్నారు. డ్రైవర్ ప్రయాణీకులను మరో బస్సులో పంపాడు. బస్సు పాండిచ్చేరి నుంచి హైదరాద్ కు వెళ్తుంది. పోలీసులు సమాచారం తెలియడంతో ఘటన స్థలానికి చేరుకున్నారు.







# వెలిగొండ ప్రాజెక్ట్ క్రెడిట్ వార్

ఒంగోలు, జనవరి 27, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'క్రెడిట్ వార్' తారాస్థాయికి చేరింది. దశాబ్దాలుగా నలుగుతున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు ప్రాంతాల తలరాతను మార్చే ఈ ప్రాజెక్టును తామే పూర్తి చేశామని ఒకరు.. కాదు తామే పునాది వేసి పరుగులు పెట్టించామని మరొకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు.వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే, 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఈ ప్రాజెక్టుకు నిధుల ప్రవాహం పెరిగింది. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చి, సుమారు రూ. 3,610 కోట్లను వెచ్చించారు. ప్రధాన కాలువలు, హెడ్ రెగ్యులేటర్ పనులను వైఎస్సార్ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఆ తర్వాత 2014-19 మధ్య చంద్రబాబు టన్నెల్ బోరింగ్ మెషీన్లను రంగంలోకి దించి, అత్యంత క్లిష్టమైన మొదటి టన్నెల్ పనులను 90శాతం పూర్తి చేశారు. 2019-24 మధ్య జగన్ రెండో టన్నెల్ తవ్వకాన్ని పూర్తి చేసి, ఎన్నికలకు ముందు ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాలని నిర్ణయించుకోవడంతో రాజకీయం రాజుకుంది. "మేము వేల కోట్లు ఖర్చు చేసి టన్నెల్ పనులను పూర్తి చేస్తే, ఇప్పుడు చంద్రబాబు వెళ్లి ఆ క్రెడిట్‌ను దొంగిలించాలని చూస్తున్నారు" అని వైసీపీ ఆరోపిస్తోంది. జగన్ హయాంలోనే ప్రాజెక్టు పూర్తయిందని వారు వాదిస్తున్నారు.అయితే, టీడీపీ ఈ వాదనను బలంగా తిప్పికొడుతోంది. కేవలం టన్నెల్ తవ్వకం పూర్తి చేస్తే ప్రాజెక్టు పూర్తి అయినట్లా అని ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి పునరావాసం పనులను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎద్దేవా చేస్తోంది. ఇంకా 7,500 పైచిలుకు కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉంది. కాలువల లైనింగ్, వంతెనల నిర్మాణం లాంటి కీలక పనులు పెండింగ్‌లో ఉండగానే జగన్ కేవలం ఓట్ల కోసం రిబ్బన్ కట్ చేశారని టీడీపీ మండిపడుతోంది. దాదాపు రూ. 9,000 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయంలో వైసీపీ చేసింది కేవలం రూ. వెయ్యి కోట్ల పనులేనని, మిగిలిన 80 శాతం శ్రమ ఇతర ప్రభుత్వాలదేనని వారు గణాంకాలు వివరిస్తున్నారు.ప్రస్తుతానికి వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్ల తవ్వకం పూర్తయిన మాట వాస్తవం. కానీ, సాంకేతికంగా చూస్తే టన్నెల్-2 లో లైనింగ్ పనులు, ఫీడర్ కెనాల్ పనులు ఇంకా పూర్తి కాలేదు. అన్నింటికంటే ముఖ్యంగా, రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నింపాలంటే 11 ముంపు గ్రామాల్లోని ప్రజలకు సుమారు రూ. 1,400 కోట్లు చెల్లించి పునరావాసం కల్పించాల్సి ఉంది. ఈ పనులు పూర్తి కాకుండా రైతు పొలాలకు చుక్క నీరు కూడా చేరదు.రాజకీయ పార్టీల వాదనలు ఎలా ఉన్నా, క్షేత్రస్థాయిలో ప్రజలు మాత్రం "నీరు ఎవరి హయాంలో వస్తుంది?" అన్నదే కొలమానంగా చూస్తున్నారు. తవ్వకాలు ఒక ప్రభుత్వం చేస్తే, నిధులు మరొకరు ఇచ్చారు. కానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం 2026 జూన్ నాటికి మిగిలిన రూ. 3,000 కోట్ల పనులను పూర్తి చేసి, నిర్వాసితులకు న్యాయం చేసి నీటిని విడుదల చేస్తే.. అంతిమంగా ప్రజల దృష్టిలో వారికే క్రెడిట్ దక్కే అవకాశం ఉంది. ఈ లోపు ఈ క్రెడిట్ వార్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని సెగలు పుట్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## నేర నియంత్రణకు ఆధునిక సాంకేతికత వినియోగించాలి--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 27:నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, వాటి పురోగతి, నిందితుల అరెస్టులు, దర్యాప్తు స్థితిగతులపై సమీక్షించారు. నేర నియంత్రణకు, పెండింగ్ కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని ఎస్పీ ఆదేశించారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ నేరాలు, చీటింగ్, హత్య కేసులు, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. బీట్లు, పికెట్స్ ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. తరచూ నేరాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలతో పాటు కఠిన నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు, ఎం. జావలి ఆల్ఫోన్స్ , డీఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ, ఏపీ మోడల్ స్కూల్ తనిఖీ---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 27:మహానంది మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటగది, మరుగుదొడ్లు, వసతి గదులు సహా మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, విద్యా సౌకర్యాలు, పారిశుద్ధ్య పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని స్వేచ్ఛగా అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు. అనంతరం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం ప్రాంతంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. వంటగది పరిశుభ్రత, భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మధ్యాహ్న భోజనం నాణ్యంగా, పౌష్టికంగా అందించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రమాణాలకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

## దివ్యాంగ క్రీడాకారులకు ఆర్థిక తోడ్పాటు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 27-నంద్యాల జిల్లా దివ్యాంగ క్రీడాకారులను సత్కరించి, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడానికి అవసరమైన ఆర్థిక సహకారం నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం అందించింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ దివ్యాంగ క్రీడాకారులు ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. క్రీడల ద్వారా సమాజంలో గుర్తింపు సాధించవచ్చని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సహకార కార్యక్రమాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ సంఘం సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 27-నంద్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం కాప్స్ రాక్స్ కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయల వారి 556వ జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా అడ్మిన్ చెన్నంశెట్టి శ్రీనివాసులు, కోఆర్డినేటర్ కామిని మల్లికార్జున గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కాప్స్ రాక్స్ క్యాలెండర్లను ఆవిష్కరించి, కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. వేడుకల్లో పాల్గొన్న వక్తలు శ్రీకృష్ణదేవరాయల వారి పరిపాలనా దక్షత, అపూర్వ నాయకత్వ పటిమ, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన సేవలను సవివరంగా వివరించారు. సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగిన శ్రీకృష్ణదేవరాయల పరిపాలన నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీకృష్ణదేవరాయల జయంతిని భవిష్యత్తులో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి రాష్ట్ర స్థాయిలో ఘనంగా నిర్వహించాలని బలమైన డిమాండ్ చేశారు. వారి ఆశయాలు, సిద్ధాంతాలు యువతలోకి తీసుకెళ్లేందుకు కాప్స్ రాక్స్ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో శ్రీకృష్ణదేవరాయల వారి ఆశయాల సాధన కోసం బలిజ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవి కొప్పుల ప్రసాద్ గారిని ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. పట్టణ అడ్మిన్స్ పగడాల నాగేశ్వరయ్య, సిఆర్ఐ శ్రీను, తోటరామయ్య, గుద్దేటి వెంకటేశ్వర్లు, గోపిశెట్టి సుబ్బయ్య, జ్వాల తిరుమలేష్, చందా చంద్రమోహన్, తోట వెంకటేశ్వర్లు, సంగా శ్రీకాంత్, తోట భూపాల్, కామేశ్వరరావు, నాగేశ్వరరావు, పత్తి మహేష్, కొమ్మ శ్రీహరి పాల్గొన్నారు. అలాగే మండలాల అడ్మిన్స్ బద్రి సుబ్బరాయడు, మనోహర్, రొడ్డ సురేష్, నోస్సం చంద్రశేఖర్, గొస్పాడు సురేష్, ఇస్కాల రమణ, అడపా వెంకటేశ్వర్లు, మాధవ్, సాయి రాయల్ తో పాటు కాప్స్ రాక్స్ క్రియాశీలక సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శిలాఫలకాలు వేయాలని కౌన్సిలర్ల డిమాండ్--

### మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చ--





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధిజనవరి 27నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో తమ ఐదేళ్ల పదవీ కాలం త్వరలో పూర్తవుతున్న నేపథ్యంలో, తమ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు వెంటనే శిలాఫలకాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు ఛైర్ పర్సన్ మాబున్నిసా దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ హాల్‌లో ఛైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన, ఎమ్ ఈ గురప్పయాదవ్ ఆధ్వర్యంలో సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మొదట అజెండా లోని 14 అంశాలపై చర్చించారు. అన్నిటికీ ఆమోదం తెలిపి నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు పట్టణంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో రోడ్ల విస్తరణ చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని వార్డుల్లో టెండర్లు పూర్తయ్యినా పనులు ప్రారంభం కావడం లేదని సభా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఛైర్ పర్సన్ మాబున్నిసా, పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్ మాట్లాడుతూ తమ వార్డులో రూ.70 లక్షల విలువైన పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదని తెలిపారు. దీనిపై ఛైర్ పర్సన్ స్పందిస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ అభివృద్ధిని మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రతి వార్డులో అమలు చేయాలని అధికారులకు సూచించారు.



అలాగే పట్టణంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రజలకు, విలీన పంచాయతీలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించేందుకు రూ.38 కోట్ల 75 లక్షల వ్యయంతో తాగునీటి పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకంలో నీటి శుద్ధి కేంద్రం, పైకప్పు నీటి నిల్వ ట్యాంకులు, పైపు లైన్లు, పంపు సెట్లు ఏర్పాటు చేయనున్నారు. పనుల అమలుకు అవసరమైన స్థలాలను ప్రజారోగ్య మరియు పురపాలక ఇంజనీరింగ్ శాఖకు అప్పగించేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా నంద్యాల పట్టణంతో పాటు విలీన పంచాయతీల్లో తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుంది. ఈ సమావేశంలో డీఈలు నాగభూషణ్ రెడ్డి, పవన్ కుమార్, రసూల్, ఆర్ఓ వెంకట రెడ్డి, శానిటేషన్ సూపర్వైజర్ మురళీధర్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ,ర శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు ఉచిత ఎరువులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 27:నంద్యాల నియోజకవర్గంలోని కౌలు రైతులకు ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ శుభవార్త అందించారు. రబి సీజన్‌లో రైతుల పంటలకు అవసరమైన ఎరువులను ఉచితంగా అందించేందుకు ఆయన ముందుకు వచ్చారు. ఈ పథకం ద్వారా కౌలు రైతు కార్డు కలిగిన పేద, మధ్యతరగతి రైతులకు ఒక్కొక్కరికి ఒక బస్తా యూరియా, ఒక బస్తా డి.ఏ.పీ, ఒక బస్తా అమోనియా ఉచితంగా ఇవ్వనున్నారు.




పంటలకు నష్టం కలగకుండా మంచి దిగుబడి రావాలనే లక్ష్యంతో ఈ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తుఫాను కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించిన గోళ్ళ రాజేష్, గతంలోనూ రైతులు, పేదలు, నిరుద్యోగులకు అనేక విధాలుగా సహకారం అందించారు. ఈ పథకానికి నంద్యాల నియోజకవర్గంలోని కౌలు రైతు కార్డు కలిగిన ప్రతి రైతు అర్హుడని నిర్వాహకులు తెలిపారు. లబ్ధిదారులు తమ కౌలు రైతు కార్డు, ఆధార్ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్‌లతో నంద్యాల నూనెపల్లె కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న సాయి ఆనంద నిలయం కాంప్లెక్స్‌లోని నాలుగో నెంబర్ షాపులో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

## రెవెన్యూ లక్ష్యాలు తప్పనిసరిగా అధిగమించాలి--

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జనవరి 27 :జిల్లాలోని ప్రధాన ఆదాయ వనరులైన ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలు కేటాయించిన వార్షిక రెవెన్యూ లక్ష్యాలను వందశాతం సాధించడంతో పాటు అధిగమించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆదాయ సమీక్ష సమావేశంలో కలెక్టర్ శాఖల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాము నాయక్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదాయం సృష్టించే శాఖల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచి లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మైనింగ్ శాఖకు రూ.250.50 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు రూ.178 కోట్లు మాత్రమే సాధించడంతో మిగిలిన లక్ష్యం చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖలో రూ.618.31 కోట్ల లక్ష్యానికి గాను రూ.496.02 కోట్లు మాత్రమే వసూలైందని, మిగిలిన ఆదాయాన్ని త్వరగా సాధించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ ఇప్పటికే లక్ష్యాన్ని మించి రూ.210 కోట్లు సాధించిందని, మార్చి నాటికి రూ.230 కోట్లకు పెంచే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రవాణా శాఖలో రూ.120.40 కోట్ల లక్ష్యానికి గాను రూ.88.42 కోట్లు మాత్రమే వసూలైనందున మరింత వేగం పెంచాలని ఆదేశించారు. ఎక్సైజ్ శాఖకు కేటాయించిన రూ.1200 కోట్ల లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.




## "ఓం నమో నారసింహాయ!

### ఆళ్లగడ్డ పట్టణ భక్తకోటికి విన్నపం...

ప్రియమైన హిందూ బంధువులారా?. భక్త వత్సలుడు, సాక్షాత్తు ఆ అహోబిల నరసింహస్వామి తన వివాహ మహోత్సవానికి తన భక్తులను స్వయంగా ఆహ్వానించేందుకు అహోబిలం కొండ దిగి భక్తుల దర్శనార్థమై ఊరురా తిరుగుతూ మన ఆళ్లగడ్డకు విచ్చేస్తున్నారు! ఈ సందర్భంగాఈ నెల 30వ తేదీ, శుక్రవారం మన ఆళ్లగడ్డ పట్టణ పొలిమేరల్లో పడకండ్ల బ్రిడ్జి వద్ద ఆ స్వామివారికి ఘన స్వాగతం పలికేందుకు హిందూ బంధువులు నిర్ణయించారు. భక్తులందరూ తరలిరావాలని కోరుతున్నాము. మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో హాజరై, మంగళ హారతులతో, జయజయధ్వానాలతో ఆ నరసింహ స్వామికి స్వాగతం పలుకుదాం. స్వామివారి కృపకు పాత్రులవుదాం. సాక్షాత్తు ఆ అహోబిల నరసింహస్వామి తన కల్యాణ మహోత్సవానికి భక్తులను స్వయంగా ఆహ్వానించేందుకు కొండ దిగి, వీధి వీధినా భక్తులను పలకరిస్తూ మన ఆళ్లగడ్డ పట్టణానికి వేంచేస్తున్నారు. ఆ అహోబిలేశుడు మన ఆళ్లగడ్డ పట్టణ గడప వద్దకు వస్తున్న ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు, స్వామివారికి ఘనంగా స్వాగతం పలికేందుకు పట్టణంలోని మహిళలు, పురుషులు మరియు భక్తజనులందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని ప్రార్థన. "గోవింద నామ స్మరణతో... ఆళ్లగడ్డ పట్టణము మారు మ్రోగే విధంగా స్వామివారికి స్వాగతం పలుకుదాం!"- ఆవుల విజయభాస్కర రెడ్డి,విశ్వహిందూ పరిషత్,ఆళ్లగడ్డ ప్రఖండ.



## మార్కెట్ యార్డు ప్రమాణ స్వీకారంపై బలిజల ఆగ్రహం--

### స్థానిక ఎన్నికల్లో సత్తా చూపిస్తామన్న బలిజ సంఘం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 27 - నంద్యాల జిల్లా :ఆళ్ళగడ్డ పట్టణంలో శ్రీకృష్ణదేవరాయ 556వ జయంతి వేడుకలను బలిజ సంఘీయులు ఘనంగా నిర్వహించారు. వైపీపీఎం కాలేజీ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బలిజ సంఘీయులు మీడియాతో మాట్లాడుతూ, ఆళ్ళగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్‌కు ప్రభుత్వం జీవో జారీ చేసి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు ప్రమాణ స్వీకారం జరగకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమాణ స్వీకారానికి అడ్డుపడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళ ఎమ్మెల్యేగా తోటి మహిళను గౌరవించి వెంటనే ప్రమాణ స్వీకారానికి సహకరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బలిజ సంఘీయుల సత్తా చూపిస్తామని బహిరంగంగానే హెచ్చరించారు. శ్రీకృష్ణదేవరాయ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, విగ్రహ ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కూడా కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాలూకా బలిజ సంఘం నాయకులు, సంఘీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**